

## మిల్లెట్‌లోకి రామోజీ గ్రూపు

హైదరాబాద్, నవంబర్ 16: రామోజీ గ్రూపు తాజాగా మిల్లెట్ల విభాగంలోకి అడుగుపెట్టింది. సబల పేరుతో వీటిని విక్రయించనున్నది. ఈ సందర్భంగా సబల మిల్లెట్ల డైరెక్టర్ సహరి చెరుకూరి మాట్లాడుతూ.. ప్రస్తుతం 45 ఉత్పత్తులను విడుదల చేసినట్లు, వచ్చే మూడు నెలల్లో మరో 55 ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. ప్రియ బ్రాండ్‌తో వీటిని ప్రత్యేకంగా విక్రయిస్తున్నట్లు, కస్టమర్లకు నాణ్యమైన మిల్లెట్లను అందించడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు, ముఖ్యంగా స్థానికంగా ఉండే రైతుల నుంచి సేకరించిన ఉత్పత్తులను కొనుగోలుదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. వీటిలో రెడీ-టు-ఈట్ స్నాక్స్, చిరుధాన్యాలతో బ్రేక్‌ఫాస్ట్, ఇన్‌స్టంట్ మిక్స్ ఉత్పత్తులున్నాయని, ఇవి రూ.75 మొదలుకొని రూ.150 లోపు లభించనున్నాయి. ప్రస్తుతానికి కంపెనీ వెబ్‌సైట్, ఈ-కామర్స్‌లో మాత్రమే లభించనుండగా, భవిష్యత్తులో రిటైల్ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆమె ప్రకటించారు. వీటిని విజయవాడలో ఇప్పటికే ఉన్న ప్లాంట్లో ఉత్పత్తి చేస్తుండగా, హైదరాబాద్‌లో ఆర్‌అండ్‌డీని నెలకొల్పినట్లు చెప్పారు.

## {రెడ్ క్యాటగిరీ} ఫార్మాకు చోటెక్కడ?

- ప్రత్యేక ఇండస్ట్రియల్ జోన్ లేక కష్టాలు
- ఎక్కువ కంపెనీలు ఈ విభాగంలోనే
- దొంగచాటుగా వ్యర్థాలు పారబోత
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): రెడ్ క్యాటగిరీ (కాలుష్యకారక)లోని ఫార్మా కంపెనీలను రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. ప్రతిపాదిత ఫార్మాసిటీ భూముల్లో గ్రీన్ ఫార్మాసిటీని అభివృద్ధి చేయనున్నట్టు ప్రకటించిన కాంగ్రెస్ సర్కార్.. రెడ్ క్యాటగిరీ పరిశ్రమల విషయంలో మాత్రం మౌనం వహిస్తున్నది. దీంతో బల్క్‌డ్రగ్, యాంటీ బయోటిక్స్ ఔషధ సంస్థలు అయోమయంలో పడ్డాయి. ఈ క్రమంలోనే ఫార్మా రాజధానిగా వెలుగొందుతున్న హైదరాబాద్‌లో రెడ్ క్యాటగిరీ పరిశ్రమలు ఇప్పటికీ దొంగచాటుగా వ్యర్థాలను పారబోయాల్సిన పరిస్థితి ఉందని పరిశ్రమ వర్గాలు వాపోతున్నాయి. దీంతో మానవాళి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన ఈ ఔషధాల తయారీ దొంగచాటు వ్యవహారంగా మారింది. వీటి తయారీ వల్ల వాయు, జల కాలుష్యం ముప్పు ఉండటంతో వీటిని రెడ్ క్యాటగిరీలో ఉంచింది రాష్ట్ర ప్రభుత్వం. అయితే వ్యర్థాల శుద్ధి ఎంతో ఖర్చుతో కూడుకున్నది కావడంతో ప్రభుత్వాలు వీటిపై పెద్దగా దృష్టి కేంద్రీ కరించడం లేదు. దాంతో కంపెనీలు రాత్రి వేళల్లో ఎవరికి తోచినవిధంగా వారు వ్యర్థ జలాలను నాలాల్లో, అడవుల్లో, ఖాళీ జాగాల్లో పారబోస్తున్నారు. రాష్ట్రంలో అనేక ఔషధ కంపెనీలు ఉన్నప్పటికీ ప్రత్యేకంగా రెడ్ క్యాటగిరీ ఇండస్ట్రియల్ పార్క్ లేకపోవడం పెద్ద లోటుగా



ఉందని పరిశ్రమ వర్గాలు చెప్పున్నాయి.

### కేసీఆర్ ముందుచూపు..

దేశానికి ఔషధ రాజధానిగా వర్ధిల్లుతున్న హైదరాబాద్‌లో ఈ పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫార్మాసిటీకి అంకురార్పణ చేశారు. సుమారు 16 వేల ఎకరాల్లో దీన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, 13 వేల ఎకరాల భూముల సేకరణ కూడా పూర్తయింది. కాగా, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అదే ప్రాంతంలో గ్రీన్ ఫార్మాసిటీని ఏర్పాటు చేయబోతున్నట్టు కోర్టుకు తెలిపింది. అయితే గ్రీన్ క్యాటగిరీలో ఎక్కువగా ఆయుర్వేద, హెర్బల్ ఉత్పత్తులకు మాత్రమే చోటు లభిస్తుందని, అల్లోపతి ఔషధాలు 90 శాతం రెడ్ క్యాటగిరీలోనే ఉంటాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. దీన్నిబట్టి ప్రభుత్వం గ్రీన్ ఫార్మాసిటీలో ప్రధాన ఔషధాల తయారీకి అనుమతించే అవకాశం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### పరిశ్రమల క్యాటగిరీలు ఇలా...

- కాలుష్య సూచిక స్కోర్ 60, అంతకంటే ఎక్కువ ఉంటే- రెడ్
- 41 నుంచి 59 వరకు ఉంటే- ఆరెంజ్
- 21 నుంచి 40 వరకు ఉంటే- గ్రీన్
- 20, అంతకంటే తక్కువ ఉంటే- వైట్

### జీరో లిక్విడ్ టెక్నాలజీతో..

సహజంగా పరిశ్రమలను వైట్, గ్రీన్, ఆరెంజ్, రెడ్ క్యాటగిరీలుగా విభజిస్తారు. ఇందులో హానికారక కెమికల్స్, బల్క్‌డ్రగ్, విష వాయువులు, పర్యావరణానికి, జీవజాతులకు హాని కలిగించే కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను రెడ్ క్యాటగిరీలో ఉంచారు. దాదాపు 90 శాతం ఫార్మా కంపెనీలు ఈ కేటగిరిలోకే వస్తాయి. ఈ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాలను ట్రీట్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. ఫార్మాసిటీలో జీరో లిక్విడ్ టెక్నాలజీతో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయాలని కేసీఆర్ ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలను శుద్ధి చేసేందుకు ఫార్మాసిటీలో కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(సీఈటీపీ)ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. కొన్ని కంపెనీలు సొంత ఖర్చుతో చిన్నతరహా సీఈటీపీలను ఏర్పాటు చేసుకున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో శుద్ధిచేసేవి కావు. దీంతో కష్టాలు తప్పట్లేదు.





హైబిజ్ టీవీ 15వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆన్‌లైన్ బిజినెస్ టీవీ రంగంలో హైబిజ్ సరికొత్త ట్రెండ్‌ను సృష్టించిందన్నారు. పదిహేనేండ్ల క్రితం ఎం రాజ్‌గోపాల్ వ్యాపార రంగానికి పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో హైబిజ్‌ను ప్రారంభించారు. వ్యాపార, పరిశ్రమలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని ఒకే వేదిక ద్వారా అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఈ ఛానెల్ అంచెలంచెలుగా ఎదుగుతూ..దాదాపు 7 లక్షల మంది సబ్‌స్క్రైబర్లతో దూసుకుపోతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

## కార్ల విక్రయాల్లో మారుతి టాప్

### అత్యధికంగా అమ్ముడైన బ్రాండ్లలో ఆరు కంపెనీయే

న్యూఢిల్లీ, నవంబర్ 16: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకీ దూసుకుపోతున్నది. గత నెలలో దేశీయంగా అమ్ముడైన టాప్-10 వాహనాల్లో ఆరు బ్రాండ్లు మారుతికి చెందినవే కావడం విశేషం. గత కొన్ని నెలలుగా అమ్మకాలు పడిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటోమొబైల్ సంస్థలకు గత పండుగ సీజన్ కిక్కునిచ్చింది. నిర్వహణ ఖర్చులు పెరిగినాయంటూ ఇబ్బడిముబ్బడిగా ధరలు పెంచుతుండటంతో కొనుగోలుదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అయినప్పటికీ గత నెలలో అమ్ముడైన మొత్తం వాహనాల్లో మారుతికి చెందిన వాహనాలకు పెద్దపీట వేశారు. అలాగే హ్యుందాయ్, మహీంద్రా, టాటాలకు చెందిన బ్రాండ్లకు కూడా మద్దతు లభించింది.






